# మంచి ముత్యాలు

నేను కాఫీకి వెళుతూ మేలుకొలుపుదామనుకున్నాను. కాని రెండు రోజులు రైలులో హూనమై వచ్చాడు. పోనీ యింతలో కాలేజీలో మునిగిపోయేదేమీ లేదుకదా అని ఊరుకుని....వేళకు భోజనంచేసి, నా దోవను నేను వెళ్ళిపోయినాను.

మనకు కొంచెం మొగమెరుకఉన్న మాపేపు అమ్మాయి ఆవేళ రేడియోలో.... కుయికుయిలాడింది. బీచి ఒడ్డున కూర్చుని విని....అసహ్యించుకుంటూ.... అడుగుతీసి అడుగువేస్తూ లాడ్జికి చేరుకునేటప్పటికి....ఆ పూట అతి ఆలస్యమైంది.

చీకటి ఏ మూలా దీపంలేదు. మెట్లు ఎక్కుతూ కేకవేశాను. జవాబులేదు. తలుపుతోస్తే వచ్చింది. మళ్ళా బిగ్గరగా పిలిచాను. పక్క వసారాలోనుంచి మూలి గాడు. చేజాడను, ఏది ఎక్కడున్నదీ వెదుక్కుంటూ, వెళ్ళి దీపం వేశాను.

.... వసారా పిట్టగోడకు కాళ్ళు తన్నిపెట్టి చెల్లాచెదరుగా ఉన్న పక్కమీద, ఐమూలగా తిరిగి, మసులుతూ పడుకుని ఉన్నాడు. దగ్గరకువెళ్ళి ఒళ్ళుపట్టి చూశాను. సలసల లాడుతూంది.

అక్కడనుంచే ఎదుటింటి డాక్టరును కేకవేశాను. వచ్చి. నిదానంగా పరీక్ష చేశాడు. బడలికవల్లనేమోనని....నాకు తోచిన సలహా యిచ్చాను. తల ఎత్తకుండా రవంత ఊగించి వెళ్ళి మందు పంపించాడు....

తగని బాధ మింగుతూన్నట్టు ఉండి ఉండి నరాలు బిగదీసుకు మూలుగు తున్నాడు. ఏమని అడిగితే పలుకడు....గడియారాన్ని కంట కనిపెట్టుకుని .... వేళకు మోతాదు తప్పకుండా....రాత్రల్లా కంటిలో వత్తివేసుకు కూర్చున్నాను — ధారకం ఏదన్నా చేద్దామని ఎన్నిసార్లు ప్రయత్నించినా, అది మాత్రం నాతరం కాలేదు.

తెల్లవారిన తరువాత కూడా అలాగే వుంది. డాక్టరు చూచి అనుమానించి అఖరుకు తాను అనుకున్నదే నిజమని నాతో తేల్చి చెప్పాడు.

మావాడు సుఖపడి వచ్చాడు.

అంతో యింతో రాటుదేరిన ఘటాన్ని, నాకేమీ అనిపించలేదు విశేషం. మనవాడు, మడివిడిచి కొంచెం దోవలోకి వచ్చాడు కదా అని పూరాగా సంతోషించేం దుకు లేకుండా పాపం మొదటిసారే, గంతు వేసీవేయడంలోనే కాలు కాస్త జారి—

అసలే బిడియపడుతూన్నవాడిని, బేజరూరు అషామాషీలతో బెదురుకొట్టవద్దని డాక్టరుకు ఆనపెట్టి మందు సక్రమంగా నడిపే కట్టుదిట్టంచేసి, వేయికన్నులతో కాచి, మళ్ళా నెల తిరగకముందు మామూలు మనిషిని చేశాను.

మనిషి మామూలుగా కనిపించుతున్నాడేకాని, మనసులో బెదురు తీరినట్టులేదు. నేను ఎన్ని విధాల మరపించాలని ప్రయత్నించినా....పరధ్యానంలోంచి బయట పడడు....పడే బాధ ఏమిటో చెప్పడు. రాత్రిళ్ళు నిదురలో....గాభరాగా కలవరించు తాడు - మేలుకుని....మూలుగుతాడు...."ఏమిటిరా అబ్బీ!-" అని ఎంత నయాన అడిగి చూసినా....ఉలకడు, పలకడు....

—తెల్లవారకముందే....లేచి కూర్చుని, దీపం చప్పగా ఆర్పేసి గదంతా చీకటిచేసి నాకు ఎక్కడ వినబడిపోతుందోనని దిగమింగుకుంటూ పట్టుతప్పి వెక్కి-వెక్కి- ఏడుస్తూన్నాడు.

విని సద్దు చేయకుండా లేచి కూర్చుని సిగరెట్ అంటించుకునేందుకు పుల్లగీసి ఆ వెలుగు అలా ఒక సెకను నిలిపి వెలుగు వెనుకనుంచి అతన్ని కణకణగా చూసి వెలుగు ఊదేసి అక్కడనుంచి లేచి వెళ్ళిపోయినాను.

ఆవాళ కాలేజీకి సెలవు. అతడు ఆ చాయలకు వచ్చి ఎన్ని వారాలైందో హాజరు మాత్రం నేను చెపుతున్నాను, మామూలుగా.

భోజనం ఆలస్యంగా చేసివచ్చి అతడివంక చూడకుండా నా మానాన నేను సర్కార్‌శాస్త్రి పుస్తకం ముందు వేసుకు కూర్చున్నాను. కాని, బలవంత బ్రాహ్మార్థంగా ఉంది. ఎంతసేపైనా పేజీ తిరగడంలేదు. ఎదురుగుండా అతడలా దిగాలుపడి ఉంటే నాకు ఓ పట్టాన తగని యిరకాటం అనిపించింది. అయినా అప్పటికే గంభీరంగా ఊరుకునే ఉండి, పండ్లబిగివిని నాలుగు కొట్టేదాకా పీఠంవేసుకు కూర్చుని ఇకనైనా కాస్త కాలు జాడించి గాలిపోసుకు రాకపోతే లాభంలేదని బయలుదేరే సన్నాహంలో ఉన్నాను.

మావాడి చాయల్లో కదలిక వినపడుతూంది. వెనుదిరిగి చూడకుండా, అద్దం ముందు నిలుచుని టై సరిచేసుకుంటూన్నవాడిని, అలాగేఉండి, అంచులోంచి ఓ కంట అతన్ని కనిపెడుతూ ఉన్నాను. షర్టుమీద ఉత్తరియ్యం వేసుకుని చెప్పుల్లో కాళ్ళు పెడుతూ ఉన్నాడు. నాతో కలసిరాకపోయినా తన మానాన తాను ఎక్కడున్నా చాంద్రాయణం చేసినా మాబాగే, కొంత తేరుకుంటాడు అని[illegible]ు చూసీ చూడకుండా, మామూలు ముభావమే అంటిపెట్టుకున్నాను.

నా వెంటనే వచ్చాడు. ఎదుటకుర్చీలో, నావంక చూడకుండా కూర్చుని, కాఫీ యిత్యాదులు నాతోపాటు కానిచ్చి అనుసరించాడు.

బీచి ఒడ్డున నడుస్తున్నాము. కెరటం ఉరవడి గమనించకుండా ఎవరి ధ్యాసలో వారముంటే, అల మామీదకు ఎగబడి విరిగి, ఉక్కిరిబిక్కిరిచేసి - అదిచూసి మాకు ఎదురుగా నడుస్తూ వస్తూన్న ఆడపిల్లలు కొంటితనం పట్టలేక పనివేళా మమ్మల్ని రాసుకునేట్టుగావచ్చి, మా ముఖాలమీదనే విరగబడినా - అది అయినా అతని గమనికకు రాలేదు.

మేరీరాణీ కాలేజీ ఎగువదాకాపోయి యిసుక మెత్తలాగా చేసుకుని దానిమీదగా ఓరగిలి, కాలుజాపి పడుకున్నాను. అతడు నా ప్రక్కన కూర్చున్నాడు. సముద్రానికి, చూపులతో అంతు కనుక్కునే పట్టుతో చూసినకొద్దీ పొంకానికి మబ్బు కమ్మకపోయినా మూసుకుంటూన్న చీకటులను దూసుకుని గట్టున పడటానికి నురగలు గ్రక్కుతూన్న ఆలలల్లే అల్లాడిపోతున్నాడు.

నాకు దిగులనిపించింది. పాపం, నిక్షేపంలాంటి పిల్లవాడికి యీ బెడద ఎందుకు

వచ్చిపడ్డదా, ఎన్నటికి కోలుకుని మళ్ళా మామూలు మనిషి అవుతాడా అని. అర్థం శుభం తెలిసీ తెలియని వయసులో యిలాటి తాకిడీలు రావడం ఉత్తరత్ర ఒకందుకు మంచిదే అయినా, అప్పటికప్పుడు తట్టుకోవడానికి మాత్రం తల తిరిగిపోతుంది.

ఆ ఆలోచన అదేపనిగా మననం చేసేటప్పటికి నా సాధక బాధకాలు చూడకుండా తన వేదన పేరను జాలితో గుండె కరగించుతూన్న అతని ఊరూ పేరూలేని వేడి అసహ్యంవేసే స్థితిలోకి వచ్చింది. అలాంటప్పుడు పరాకున ఏం మాట తూలుతానో అని నన్ను నేనే చీదరించుకుంటూ మాటలు అయీ కాని ధ్వనితో కసురుకున్నాను. అందుకు అతడు తలయెత్తి ఉలికిపాటున చూశాడు. వంచుకు కుంచుకు పోకుండా గడ్డం క్రిందుగా చేత్తో గిరిగీసి ముగ్గులోకి దింపాను.

"చెపితే పోయేదికాదు. నా బాధ నాతోనే ఉంటుంది" అని విరక్తితో గునిశాడు. నేను స్థాయి ఎక్కించకపోతే పాకాన పడేటట్టు లేదు.

"చెపితే పోదా....చెప్పేది కాదా?"

ఆతడు అంతకూ కలిపి ఏకబారున తల ఊగించాడు.

"పోకపోతే అన్నింటితోబాటు అదీ ఒక పక్కన పడిఉండనీ. అంగాని నెత్తి నెక్కించుకోమోక"

"నా చేతకావడంలేదు."

"కనుకనే నేను సాయంపట్టి దాన్ని అవతలకు దొర్లిస్తా నన్నది. విన నేర్పు అయినా లేదా నీకు?"

"నాకు ఏమీ లేదేమో యీ లోకంలో అసలు"

"అదుగో, వేదాంతంలోనికి పోయావా తంతాను. ఏమిటోయ్! నీకేం కొమ్ములు మొలిచినాయా?"

"విరిగినాయి."

"ఏ కొండకేసి కొట్టావో...."

"కొండ విరుచుకు మీదపడితే దాని క్రిందపడి నుగ్గునుగ్గవడం తలదా తప్పు?"

"అడిగిన దానికి జవాబు చెప్పడం అలవాటు కానివాడవు, ఎలా యిన్ని మెట్లు

ఎక్కివచ్చావు? నీకన్న నేను ఎక్కువగా ఇంకా అడ్డదిడ్డంగా మాట్లాడగలను, ఎన్ని వేషాలైనా వేయగలను. తాతకు దగ్గువరస నేర్పక !

అవును, కాదు అని నోరువిప్పి చెప్పడానికే యింత సాగదీయించుకునేందుకు ఆ ఆట లిక్కడకాదు, అత్తవారియింట్లో"

ఎందుకోసం అతడలా వలవలా ఏడ్వడం మొదలుపెట్టింది? అందులో నే ననుకోకుండానే ఏదైనా ఘాటుగా తగిలిందా ? రగడ పెరిగిపోతూన్నదే!

"అన్నీ తెలిసేనా"

"ఎవరికి? నీకా, నాకా? - నీవు, తెలిసిచేస్తూన్న పనే అయితే నీమీద జాలితలచిన వాడు శుద్ధఫూల్. కాని నాటకమాడే నేర్పు నీకు ఉందని, యిప్పటికీ నాకు నమ్మకం కలగక పోవడంచేతనే."

"అందుకు నా కృతజ్ఞతాపూర్వక...."

"ఆ వందనాలేమో హెచ్చవేసి నీకు చఖలు చేసుకుంటానుగాని యిక, నీవు బాధపడి నన్ను వేధించక అసలు గొడవేమిటో తేల్చు. అంతగా మిన్ను విరిగి మీదపడే విషయమైతే అప్పుడు ఓ చెయిచూద్దాం. అప్పుడూ, యిప్పుడూ, నేను అండను ఉన్నంతవరకూ నీకువచ్చే ఫరవా ఏమీలేదు"

చెపుదాం అనే తెగింపు మొగంలో అలా స్పష్టంగా కనుబడుతూన్నా, అతను యింకా బెరుకుగా వెనుకాడుతున్నాడు. ఈ పట్టున విడవకుండా రెచ్చగొడితేనేగాని పసివాడు పలువరుస విప్పడని, నేను ఊహించిన కథ ఊదేసి ముగ్గులోకి దింపుదామని,

"ఏం నీవు చెపుతావా ? .... నన్ను చెప్పమన్నావా" అని అడిగి అతనిచేత సరేనని తల ఊపించి, నేను పాయలు దీయడం పూనుకున్నాను.

"అనగనగా ఆ అబ్బాయికి ఆ వేసవికో మళ్ళా రోహిణికో భార్య కాపరానికి వస్తుంది. వస్తుందికదా ఎప్పుడెప్పుడని ఎదురుచూస్తూ నోట్లో వేలువేసుకుని ఆ గడియ రావడం కోసం కనిపెట్టుకుని కూర్చునే అంత అర్భకుడు కాకపోవడంచేత, ఆ శుభ కార్యానికి దోహదంగా కొంత ఆ పంపిణీ మీదనే యీలోగా కాలక్షేపంచేస్తే - ఎందుకన్నా ముందుకు అక్కరకు వస్తుంది కాదూ — అనే ఆలోచనపోయి అంగ బలమూ, అర్థబలమూ పుష్కలంగా ఉన్నవాడు గనుక, అనుకున్నపని అతి ధారాళంగా అవిచ్ఛిన్నంగా నిర్వర్తించడంచేత ఆ తపో —వేడిమికి అతల వితల తలాతలాదికాలు

ఉడికిపోయే దివ్యస్థితి యథాక్రమాన సంభవించగా, మహర్షి తపోబలం మోపై తల్ల క్రిందులై తల్లడిల్లి పోతున్నాడు. పురుషుడిని కర్తగా కథ ప్రారంభంచేసి కార్యకలాపానికి పురాణచ్ఛాయ ఎందుకు ఇవ్వవలసి వచ్చిందంటే, "దేవతలు చేయు తప్పులు దివ్యకథలు, అని పాతనాటకం ఎందులోనో ప్రమాణం మనకు లభించింది."

మన ధోరణి వింటూన్నకొద్దీ నవ్వులో పడిపోయి మగతగా ఉండటం మరచిపోతాడని ఆశపడటం నాది పొరబాటు.

"దేవత ఉభయవాచకమని నీవు ఒప్పుకుంటావా?"

వైయాకరణి అడిగేతీరు అది కాదుగాని, నీ వన్నది తెలిసింది. అడదైనా అంతేనా అనేనా దేవర ప్రశ్నించేది? అలాగైతే,

అనూపానూ తెలియనందువల్ల నా ఊహ ఎక్కడ బెడిసిందో తోచలేదు. అతని వాలకంచూస్తే ఇందాకటినుంచీ నేను పోయిన ఊహలన్నీ చెరిపేసి కథ ఇంకో విధంగా అల్లుకు రావలసి వస్తుంది. అందుకు అనేక చిలువలు పలువలూ ఉన్నాయి. ఏ చిగురు కదిలించినా, ఏదో చిక్కే, అయినా మరో మాదిరిగా వాయించి చూదామని....

అలా అయేపక్షంలోనూ యీ తంతు అంతా జరుగుతుంది. రసం ఒకటే, రుచి స్థాయిభేదంకాని, అసలు ఆలోచన తెమిలేందుకు వ్యవధానం తెచ్చుకోడానికని, నే ననేదేమిటో నాకే అర్థంకాకుండా, కోమటి పురాణంలోకి దిగాను.

ఆతను సరిగానే అర్థం చేసుకుని నేను చెప్పిన పాఠమే నాకు ఒప్పగించడం మొదలుపెట్టాడు.

"అనగా అనగా ఆ అబ్బాయి ఉన్నాడే, అతనిమీద నీవు మోపిన నిందలే నిజమైతే ఆతడు ఏనుగు నెక్కినట్టు సంతోషించుతాడు. అన్నీ అబద్ధాలు. అందులో అతని దోషం ఏమీలేదు...." అని ఎలుగు రాచినట్టుగా అన్నాడు.

"అని నేను నమ్మనా?"

"అది నీ దయ. కాని యిదంతా నాటకమని నీవు నన్ను చూస్తూండి కూడా అనుకుంటే నేను సహించలేను. నామీద జాలిపడవద్దు. నన్ను నీ చాయలకే రానీయ వద్దు. నీకు యిష్టం లేకపోతే అంతే. నా బాధ నిజమని నమ్ము."

"నాకు తెలిస్తేగా"

"అవును. అంత ఘోరాన్ని నీవు అనుకోలేవు. నేనూ అలా జరుగుతుందని కలలో అయినా తలచలేదు....కాని జరిగింది."

"ఊఁ...."

"నేను మొన్న మా ఊరు వెళ్ళినప్పుడు మావాళ్ళు పండగకని కోడలిని మా యింటికి తీసుకు వచ్చారు."

"అదృష్టవంతుడివి. అనుకోకుండా అలా కలిసి రావాలి"

"కలిసినందుకే వచ్చింది"

ఆరోగ్యం యీ నడుమ చెడిపోవడంవల్ల మెదడేమన్నా డొంకల్లో సంచారం చేస్తుందా ఏమని, నిర్ఘాంతపోయి నిలువు చూపులతో అతని ముఖానికి కన్నులప్పగించి అలా కదల మెదలలేక పోయినాను. అత డనేదాంట్లో, నిజమే వుంటే అంతటితో యిక కొంప లంటుకుపోయినవన్న మాటే. ఆ మంట యిక చల్లారదు.

అతనిలో అకారణంగా అమాయకురాలిమీద, అలాటి నింద వేయడానికి తయారు కాగలిగిన నీచత్వం ఏ కోశాన అయినా ఉండటానికి అవకాశము ఉండ వచ్చునేమో అనే ఊహ కూడా నాకు కలగవలసిన సందర్భమే అయినా, అద్దంవంటి అతని మనసు నే నెరుగుదును. ఎంతో మనసుపడి, ఏరీ కోరీ తెచ్చుకున్న బంగారపు బొమ్మను ఎన్నడైనా ఎప్పుడు కొరుక్కుతిందామా అనే రెపరెపలాడే వయసుకాడు, అనవసరంగా అంత అన్యాయానికి ఒడిగట్టి ఆ చిన్నదాని జీవితం పాడుచేయగలడా?

అతడు అబద్ధం ఆడవలసిన అగత్యం లేదు, ఎటు పారజూచినా.

ఆ పిల్లదాని విషయంలో ప్రేలువంచడానికి వీలుపడని నిప్పంటి వంగసం? పరాకున అయినా ఆ యింటపుట్టిన పడుచులమీద అలాటి పాపంమాట పడవేయడానికి, పగవాడైనా తలచడు.

ఎలా సమన్వయం చేయాలి?—

కీలకంలో ఏదో తికమక ఉండితీరాలి, అని మనసుకు తడుతూనే ఉంది. కాని, తెమిలి, చిక్కు విడటంలేదు. కాని, అదే లక్ష్యంతో, తరచగా తరచగా కిటుకు మెదడుకు చిక్కింది. తెలిసిన తరువాత, తెలివి ఇంతలో ఉన్నదిగదా పనీపాటా లేనట్టు, ఎలుకను పట్టడానికి కొండంతా త్రవ్వినట్టుగా, అని నాలో నేను అతనికి తెలియ రాకుండా నవ్వుకున్నాను.

నే నేమనుకున్నదీ, అతనికి తెలియనీయలేదు. నా మాటనమ్మి చెడినవాడు లేడు కాని, ఇప్పుడు అతనికి ఏది చెప్పినా నమ్మడు. ఇంత ముదిరిన తరువాత, నమ్మించి మళ్ళాదోవకు మళ్ళించకపోయినానో ఇక ఇంతలో బాగుపడి కోలుకోడు.

ఏమనకుండా, గంభీరంగా ఊరుకున్నాను. ఎవరి ఆలోచనలతో వారు, మసక ముదిరేదాకా, అక్కడ కాలక్షేపం చేసి, తిరిగివచ్చి వేగిరం భోజనాదికములు ముగించు కున్న తరువాత మళ్ళా బయటికి బయలుదేర దీశాను. వెళ్ళేటప్పుడు "ఎక్కడికి" అని నదురుతో అడిగాడు. "ఎక్కడికో – అక్కడికే" అని యిక ప్రశ్నించకుండా ఉండే టట్టు సమాధానం చెప్పాను.

బస్సుదిగి ఆ వీధివేపు వెళతూన్నప్పుడే అతను కనిపెట్టి వెనక అడుగు వేయ బోయినాడు అతని ఆటలు సాగనీయలేదు. అనుకున్నది అయేదాకా మాటాడేందుకైనా వీలు బెసకనీయలేదు. ఏమనుకున్నాడో ఏమోకాని ఎదురు చెప్పకుండా పరమ విధే యతతో నాతోబాటు రాత్రంతా యథావిధిగా పండుగ చేశాడు.

తెల్లవారకముందే సానివాడనుంచి తప్పించుకు బయటపడి కాఫీవేళకు యింటికి వచ్చేశాము. అనుకున్నదానికన్న అలవాటులేని ఆపోశనం కనుక ఎక్కువగా అలసి పోయి వసి వాళ్వాడుతూ అతడు పట్టు బలవంతాన రవంత చిరుతిండి తిని ఆమీద అద మరచి నిద్రపోయి, అనక ఎప్పుడో దీపాలు పెట్టేవేళకు లేచాడు.

"ఫిర్" - మళ్ళా రాత్రి నిన్నటివేళ అవుతోండగా అతడు, ముస్తాబు కావడం చూసి, కొంటెతనానికి అన్నాను.

"తుర్—"

చేతనైతే రెక్కలు కట్టుకుని, అక్కడకు ఎగిరివెళ్ళి ఎప్పుడు వ్రాలుదామా అన్నంత ఉత్సాహంతో ఉన్నాడు. రంగం చెడకుండా ఉండేందుకు, కడుపునిండినా నేనూ అతనితోపాటు సహపంక్తికి తయారుకాక తప్పిందికాదు, పదిరోజులపాటు.

చెక్కు చెదరకుండా నునుపు తేలుకుంటూ వస్తున్నాడు. అతడిని అలా వదలి వేసి వూరుకుంటే వ్యవహారం మరీ ముదిరి, పట్టపగ్గాలు లేకుండాపోతే అప్పుడు అను కుని, దింపిన దొహటీ అయిందొకటీగా అయితే, ఇక....

"....ఎంతకాలం యీ ఆటలు....?" ఒక సాయంకాలము అతడు అక్కడకనే బయలుదేరబోతూంటే మాట వరుసగా అన్నాను.

"....సాగినంత కాలం .... ఇంకా చిలుము మిగిలింది. అది కాస్తా కూడా

అమ్మవారి పరమైపోయిన తరువాత అప్పుడు ఆట కడుతుంది" మాంచి ఆరోగ్యంగా జవాబు చెప్పాడు.

"ఆట కట్టింది...." అన్నాను.

"అది....నీకు ఎలా తెలుసు?"

"ఆడించిన వాడిని....కనుక...."

"అయితే....అతి దారుణం...."

"అంతకన్న దారుణమైన అంచనా నేను వేసింది."

"అవును, నీ వంతవాడవే."

"అంతకు అంతవాడిని. ఇప్పుడు నీకు అర్థమౌతుంది. చెప్పనా? నీవు యిన్నాళ్ళూ నిప్పుల గుండం త్రొక్కావు. అది పచ్చి విషకన్య. దానిమీద చేయివేసిన వాళ్ళు యిదివరలో చాలామంది మళ్లా కోలుకోలేదు. ఏరికోరి, నీకు దాన్ని కావాలనే జోడించాను. ఎందుకో చెప్పనా? నీవు మంచం ఎక్కావనుకో! అప్పుడు నీ బాధకు జాలి పడినా, అంతకన్న విచారించేవాడిని కాను. నీకు ఆ మాత్రం ఘాటైన శిక్ష నీవు చేసిన పనికి కావాలిసిందే. కాని, నాకు నమ్మకం ఉన్నది. నీవు నమ్మని ఆ అమాయకురాలు-నీ యిల్లాలి శీలమే నిన్ను వేయికళ్ళ కనిపెట్టి కాపాడుతుందని. అంత ధైర్యం లేకపోతే, ఎంత మొండినైనా చూస్తూ చూస్తూ యింతకు సాహసించలేక పోయేవాడినే. నిన్ను దోవకు తిప్పడానికి యింతకుమించిన ఉపాయం దీన్ని మించిందిలేదు. చేశాను, యిప్పటికైనా చూశావా?"

"సంతోషించాను. సమయం వస్తే నిన్ను నమ్మిన వాడిని అని అయినా చూడకుండా పాతాళంలోకి నెట్టేయగలవు."

"అవును, అటూ యిటూ లేకుండా మధ్యను త్రిశంకుడిలాగా నావాడు ఉంటే నాదేం ప్రయోజకత్వం. చేతికొద్దీ విసిరితే, నీతిమాలినవాడైతే అడుగుకి అంటుకు పోతాడు. కాకపోతే ఎదురెగిరి ఆ ఊపుతో స్వర్గం మీదకు గంతువేస్తాడు. ఎటైనా మా బాగే."

"అంతే కాని, నేను ఎంత చెప్పినా నా మాట మీద నీకు నమ్మకం కుదరలేదు."

"నీ గౌరవంమీద నమ్మకం పోలేదు. ఓయి జోగులూ ! నీకు మతిపోయింది

కాని, నాకేం కర్మం? వెనుకాముందూ ఆలోచించగల నిదానం ఉంటే నాకీ శోష తప్పేది కాదూ? ఒక్కటి చూస్తే నీకీ శంకలన్నీ లేకపోయేవే. నీ భార్యకు అక్కరరాకముందే ఆభరణాలతో తయారు కావలసిన అవసరం ఏం వచ్చింది? వస్తే అవలి వానిని మరగి నిన్ను అసలు దగ్గరకు రానిచ్చేదేకాదు. పోనీ ఎవడన్నా బలాత్కరించాడేమో అనుకుంటే అంతపని జరిగినమీదట, అయిన యింటి పిల్ల ఇక బ్రతికేదా? ఆమెలో లోపం ఏవిధంగానూ ఎటుజూచినా ఉండటానికి వీలులేదు. అందుకనే నీ మర్యాద చెడలేదని నీవు చెడకుండా కాపాడుకునేందుకు నిన్ను యిలా చెడగొట్టవలసి వచ్చింది.

ఇప్పుడు కొంచెం మెదడు చేత పనిచేయించి చూడు. నీ భార్యతో సుఖపడబోయి సంకటస్థితిలోకి వచ్చావు. సంకటాలలో యీదులాడి శిగపూవాడకుండా ఒడ్డెక్కావు. తగిలించుకునే బేడీలు తన తత్వంలో ఉందికాని ఆవతల అవి ఉన్నా లేకపోయినా "ఉండందీ తగులవు" అనేది మామూలీ మాట. శాస్త్రం ఒప్పుకోదు. నీవూ ఒప్పుకోక తప్పదు, తప్పుచేసినందుకు పరిహారంగా-

రాజతరంగణిలో కథఉంది తెలుసునా. మహారాజు చక్రవర్మ చూసిన పామును పుట్టలోకి పోనీయకుండా చేసిన పాపానికి....పరిహారణోపాయం-అంతరంగికు లుపదేశించినదేమంటే ఇదివరకువన్నీ తుడిచిపెట్టుకుపోయేందుకు పతివ్రతతో సాంగత్యం చేస్తే ఫలం దక్కుతుంది అని. ఆమీద కథ చాలా ఉంది కాని మనం ఇది ఉపయోగించుకుందాం."

"మనం .... భరించగలమా?"

"ఇంకా పెరటి ద్రోవనే ఉన్నావు. భరించేవారున్నారుగా మన పతివ్రతలు. బిచాణాకట్టు, మా యింటికి నేనూ, నీ అత్తవారింటికి నీవూ...."

"ఏ మొగం పెట్టుకొని...."

"ఎప్పటి మొగమే .... ఆ మొగం యిన్నాళ్ళయి కనపడకపోతే అందుకు ఎంత మొగం వాచిపోతుందో, పాపం ఆ పసిది...."

"అవును, పసిది"

"అందుకున్నావు లేవోయ్ పిడుగా! దైవం చల్లగా చూస్తే మళ్ళా యీనాటికి ఆ పసిదాని....కో పసిది....అంత ఘటికుడవే....ఇంతకూ నా మాట తప్పదమంటూ ఉంది గనుకనా?"